### ఖాతాదారుల భద్రతకు ఆర్బీఐ పెద్దపీట..

## మూడు కీలక అంశాలపై కొత్త రూల్స్

ఢిల్లీ: బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలకు పరిహారం, ఆర్థిక ఉత్పత్తుల మిస్-సెల్లింగ్‌కు అడ్డుకట్ట, లోన్ రికవరీ ఏజెంట్లపై ఏకరీతి నిబంధనలు తీసుకురానున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ఈ మూడు కీలక అంశాలపై త్వరలోనే ముసాయిదా మార్గదర్శకాలను ప్రజాభిప్రాయ సేకరణ కోసం విడుదల చేయనున్నట్లు తెలిపారు. చిన్న విలువ గల మోసపూరిత లావాదేవీలు జరిగినప్పుడు వినియోగదారులకు పరిహారం అందించేందుకు కొత్త నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీలలో కస్టమర్ల బాధ్యతను పరిమితం చేస్తూ 2017లో మార్గదర్శకాలు జారీ చేశామని, అయితే అప్పటి నుంచి సాంకేతికతలో భారీ మార్పులు వచ్చిన నేపథ్యంలో వాటిని సమీక్షిస్తున్నామని వివరించారు. అలాగే బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఆర్థిక ఉత్పత్తులను, సేవలను తప్పుదోవ పట్టించేలా విక్రయించడాన్ని (మిస్-సెల్లింగ్) అరికట్టేందుకు నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలకు, వారి రిస్క్ సామర్థ్యానికి సరిపోని ఉత్పత్తులను విక్రయించడం వల్ల ఇరు వర్గాలకూ నష్టమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఉత్పత్తుల ప్రకటనలు, మార్కెటింగ్, విక్రయాలపై సమగ్ర మార్గదర్శకాలను తీసుకురానున్నారు. ఇక, లోన్ రికవరీకి సంబంధించి రికవరీ ఏజెంట్ల నియామకం, వారి ప్రవర్తనపై ప్రస్తుతం బ్యాంకులకు, ఎన్‌బీఎఫ్‌సీలకు వేర్వేరు నిబంధనలు అమలవుతున్నాయని గవర్నర్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అన్ని నియంత్రిత సంస్థలకు ఒకే రకమైన, ఏకీకృత నిబంధనలను తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అంశంపైనా ముసాయిదా మార్గదర్శకాలను త్వరలో ప్రజాభిప్రాయ సేకరణకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

## ఇస్లామాబాద్‌లోని షియా మసీదులో భారీ పేలుడు

ఢిల్లీ: పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో ఓ షియా మసీదు లక్ష్యంగా జరిగిన ఈ భీకర దాడిలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను స్థానిక అధికారులు ధృవీకరించారు. ఇస్లామాబాద్‌లోని ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కావడంతో ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైన సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించాయి. నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మసీదు ప్రధాన ద్వారం వద్ద దుండగుడు తనను తాను పేల్చుకుని ఉండవచ్చని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఈ దాడిని పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఇస్లామాబాద్‌లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ తాజా ఘటనతో రాజధానిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

### గర్భస్రావంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

## 30 వారాల గర్భం తొలగింపునకు అనుమతి

ఢిల్లీ: గర్భస్రావానికి సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. పుట్టబోయే బిడ్డ హక్కు కంటే తల్లి పునరుత్పత్తి స్వేచ్ఛకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేసింది. ఇష్టానికి విరుద్ధంగా గర్భాన్ని కొనసాగించాలని ఏ మహిళను బలవంతం చేయలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు 30 వారాల గర్భంతో ఉన్న 18 ఏళ్ల యువతికి గర్భస్రావం చేయించుకునేందుకు అనుమతి ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... 17 ఏళ్ల వయసులో ఓ యువతి తన స్నేహితుడితో సంబంధం కారణంగా గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె వయసు 18 ఏళ్లు కాగా, గర్భం 30 వారాలకు చేరుకుంది. గర్భస్రావం కోసం ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం అనుమతి నిరాకరించింది. బిడ్డను ప్రసవించి, దత్తతకు ఇచ్చేయాలని సూచించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ యువతి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ దశలో బిడ్డను కనడం వల్ల యువతి మానసికంగా, శారీరకంగా తీవ్ర వేదనకు గురవుతుందని అభిప్రాయపడింది. సామాజిక కారణాల వల్ల ఆమె తీవ్ర అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న వాదనను పరిగణనలోకి తీసుకుంది. గర్భస్రావం వల్ల యువతి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని మెడికల్ బోర్డు నివేదిక ఇచ్చిన విషయాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. "పుట్టబోయే బిడ్డ ప్రయోజనాలా? లేక జన్మనిచ్చే తల్లి ప్రయోజనాలా?.. ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాలి? తల్లి ఇష్టానికి వ్యతిరేకంగా గర్భం దాల్చమని కోర్టు బలవంతం చేయలేదు" అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. చట్టపరమైన మార్గాలు మూసుకుపోతే, మహిళలు అక్రమ మార్గాల్లో గర్భస్రావాలు చేయించుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. బాంబే హైకోర్టు తీర్పును పక్కనపెడుతూ, యువతి గర్భస్రావానికి ధర్మాసనం అనుమతి ఇచ్చింది. భారత చట్టాల ప్రకారం 24 వారాల తర్వాత గర్భస్రావానికి కేవలం కోర్టు అనుమతి మాత్రమే ఏకైక మార్గం. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది.

## పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం తీసుకొస్తున్నాం

హైదరాబాద్: తెలంగాణ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు రాష్ట్రంలో కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' మోడల్ ను అనుసరించి ఈ పథకానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. కేరళలో ఒక సర్వే నిర్వహించారని... దాని ద్వారా 65 వేల మంది పేదలను గుర్తించి, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారని సీతక్క తెలిపారు. అదే తరహాలో తెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సర్వే చేయించి, పేదరికంలో ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి తగిన సాయం అందిస్తామని సీతక్క తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడినా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ కొత్త పథకం ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

## సినీ పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం దిల్ రాజు మాతో మాట్లాడుతుంటారు

హైదరాబాద్: చిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో మాట్లాడుతుంటారని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సినీ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం తరఫున ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నా సలహాలు, సూచనలు ఇస్తుంటారని, అందుకు ఆయనను అభినందిస్తున్నానని అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టాలీవుడ్ ఎలాంటి సాయం కోరినా తెలంగాణ ప్రభుత్వం చేస్తుందని హామీ ఇచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా చేయాలనేది తమ ప్రభుత్వం సంకల్పమని అన్నారు. ఈ మేరకు బ్లూప్రింట్ సిద్ధం చేశామని తెలిపారు. సినిమా రంగం ద్వారా సామాజిక సందేశాలు ఇవ్వడంతో పాటు వాణిజ్య పరంగా లబ్ధి పొందవచ్చని అన్నారు. చిత్ర పరిశ్రమ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని తెలిపారు. పరిశ్రమకు ఎలాంటి అవసరం వచ్చినా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ప్రత్యేకంగా చెప్పమన్నారని తెలిపారు. వారు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉన్నందున వారి తరఫున చెబుతున్నానని అన్నారు. గద్దర్ అవార్డుల వేడుకను దిల్ రాజు ఓ బాధ్యతగా స్వీకరించారని అన్నారు.

## పాస్‌బుక్‌లు ట్యాంపర్ చేస్తే జైలుకే

కలుగొట్ల: భూమిపై ఇతరులెవరూ కన్నేయకుండా ప్రజలకు సర్వహక్కులు కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. "గతంలో భూ సమస్యల ఫిర్యాదులు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇప్పుడు భూమిని ఇతరుల పేరుపైకి మారిస్తే వెంటనే తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే మీరు చూసుకోవచ్చు. మీ రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రంగా ఉంటాయి. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. రాజముద్రతో పట్టాదారు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. వీటిని ఎవరైనా ట్యాంపర్ చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం. అలాంటి వారిని వదిలిపెట్టేది లేదు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిని కూడా కల్తీ చేశారు. సీబీఐ, సిట్ ఏమీ లేదని చెప్పారని అంటున్నారు. అందులో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించింది. బాత్‌రూమ్ క్లీన్ చేసే రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా చేశారు. శ్రీశైలంలో కూడా రసాయనాలతో ప్రసాదం కల్తీ చేశారు. నేను సీఎం అయ్యాక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించాం. తితిదే ఈవోను మార్చి మంచి ఆఫీసర్‌ను తీసుకొచ్చాం. గతంతో పోలిస్తే లడ్డూలో చాలా వ్యత్యాసం ఉంది"అని చంద్రబాబు అన్నారు.

## మేం చేసినవి చెబితే.. గుండెలు పగిలిపోతాయ్..

మొదటి పేజి తరువాయి

ఆ పట్టణాల డంపింగ్ యార్డును మధ్యలో ఉంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తాం. కార్యకర్త నుంచి కేంద్రమంత్రి వరకు ఎదిగిన బండి సంజయ్ కరీంనగర్‌లో మా వాళ్లను బెదిరించడం మాని మోదీ వద్దకు వెళ్లి నిధులు తీసుకురావాలి. అసలు మీ పార్టీలో ఏం జరుగుతోందో మీకు తెలియదు. మీకు, కిషన్‌రెడ్డికి మోదీ అపాయింట్‌మెంట్ దొరకదు. కేటీఆర్, కేసీఆర్‌లకు వ్యతిరేకంగా కిషన్‌రెడ్డి మాట్లాడరు" అని సీఎం దుయ్యబట్టారు. సభావేదికపై కరీంనగర్ జిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.110 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్, విజయరమణారావు, మక్కాన్‌సింగ్, సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భారాస, భాజపాలది ఫెవికాల్ బంధం.. వారెన్ని విమర్శలు చేసినా రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే మా ధ్యేయం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు రూ.45 కోట్లతో ఏటీసీ భవన నిర్మాణం తదితర అభివృద్ధి పనుల శిలాఫలకాలను వేదిక పక్కన ఏర్పాటు చేయగా సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఆస్తులు సంపాదించారు.. ఫాంహౌస్‌లు కట్టుకున్నారు.. కానీ పేదలకు ఇస్తామన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదు. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20 లక్షల కోట్లు వచ్చినా ఇళ్లు నిర్మించలేకపోయారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో 25 లక్షల మందికి ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లే ఇప్పటికీ కనిపిస్తున్నాయి. పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఇప్పుడు మళ్లీ ఇళ్లిస్తున్నాం. రైతుల కరెంటు కష్టాలు చూడలేక.. ఉచిత విద్యుత్తు తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. అది కాంగ్రెస్ పేటెంట్. భాజపా తరఫున మోదీ, అమిత్‌షా ప్రచారానికి వచ్చినా ఒక్క కార్పొరేషన్, మున్సిపాలిటీలోనూ ఆ పార్టీ గెలవదు. తెలంగాణకు భాజపా ఏమిచ్చిందని జాతీయాధ్యక్షుడిని మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చారు? మోదీ 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్నా.. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదు. మెట్రో రెండో దశకు నిధులివ్వలేదు. మూసీ ప్రక్షాళన మాటెత్తలేదు. ఏ ముఖం పెట్టుకొని మళ్లీ వచ్చారు. భాజపా తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు. భారాస-భాజపాల శరీరాలు వేరైనా తల మాత్రం ఒక్కటే. అవయవ దానం మాదిరిగా భారాస.. సీట్లు, ఓట్లు భాజపాకు దానం చేస్తోంది. వేల కోట్ల దోపిడీ చేసిన భారాసకు భాజపా సహకరిస్తోంది. భారాసకు కాళేశ్వరం ఏటీఎం అని మోదీ, అమిత్‌షాలే అన్నారు. మేం కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చించి సీబీఐ విచారణ జరపాలని కోరితే ఆరు నెలలైనా అతీగతీ లేదు. ఫార్ములా-ఈ రేసు కేసులో కేటీఆర్‌ను, కాళేశ్వరం విషయంలో హరీశ్‌రావును ఎందుకు జైలులో వేయడం లేదు? మీ మధ్య ఏ బంధమూ లేకుంటే మున్సిపల్ ఎన్నికల్లోగా వాళ్లని అరెస్టు చేయించాలి. భాజపా, భారాసల చీకటి ఒప్పందాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోంది. రెండేళ్లలో మేమేం చేశామని అడుగుతున్నారు. ఏం చేశామో చెబితే వాళ్ల గుండెలు పగిలిపోతాయి. నిరుద్యోగులకు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. రూ.20 వేల కోట్లతో 100 యంగ్ ఇండియా స్కూళ్లను ప్రారంభిస్తున్నాం. విద్యార్థుల భోజన ఛార్జీలను 40 శాతం పెంచాం. కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం పెంచాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం అందించనున్నాం. ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలకు యూనివర్సిటీలిచ్చాం. 25 లక్షల మందికి 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రుణమాఫీ చేశాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్తునిచ్చాం. రెండేళ్లుగా రైతుల నుంచి గింజ కూడా వదలకుండా ధాన్యం కొన్నాం. 48 గంటల్లో ఖాతాల్లో డబ్బులు వేశాం. అదే కేసీఆర్ ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో పండించిన పంటను ప్రైవేటు విత్తన కంపెనీకి క్వింటాలు రూ.4 వేల చొప్పున అమ్ముకున్నారు. సూరత్ నుంచి బతుకమ్మ చీరలు కిలోల లెక్కన తెచ్చి.. కోట్ల రూపాయలు కమీషన్ తీసుకున్నారు.

పేదల పండగ సమ్మక్క-సారలమ్మ జాతరకు కేసీఆర్ రాలేదు. కేటీఆర్, హరీశ్‌రావులూ రాలేదు. అమ్మవారి దర్శనం చేసుకోవడం వారు నామోషీగా భావిస్తారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు రూ.4-5 వేల కోట్లతో అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తాం. కేసీఆర్‌లా జీవోలు ఇచ్చి మాట తప్పం, నిలబెట్టుకుంటాం. రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని కేసీఆర్ దివాలా తీయించి మాకు అప్పగించారు. ఎక్కడా చిల్లిగవ్వ పుట్టనివ్వకుండా చేసి ఆయన మాత్రం ఫాంహౌస్‌లో పడుకున్నారు. ఒక్కో సమస్యను అధిగమిస్తూ ప్రభుత్వాన్ని నడిపిస్తుంటే మెచ్చుకోవాల్సింది పోయి నోటికొచ్చినట్లు తిడుతున్నారు. కనీసం అసెంబ్లీకి రాకుండా నెల నెలా జీతమెలా తీసుకుంటున్నారో అర్థం కావట్లేదు.

## రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి చూపిస్తా

మొదటి పేజి తరువాయి

ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు. కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు. గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పెద్ద నాయకులు పార్టీని గాలికి వదిలేసినట్లుగా ఉంది

మొదటి పేజి తరువాయి

బీసీల అంశంలో బీఆర్ఎస్ పార్టీ ఏనాడూ చిత్తశుద్ధితో వ్యవహరించలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలో వద్దో బీసీలే ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం ప్రముఖంగా కనిపించడం లేదని అన్నారు. ఆ పార్టీ నేతలు ఎవరూ కిందిస్థాయిలో క్రియాశీలకంగా లేరని విమర్శించారు. కృష్ణార్జునులు రాష్ట్రమంతా ఎందుకు పర్యటించడం లేదని ప్రశ్నించారు. వారిద్దరూ రాష్ట్రస్థాయిలో ప్రచారం చేయడం లేదంటే రాష్ట్రస్థాయి నాయకులు కానట్లే కదా అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్ తన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ వేసిన మాధవరెడ్డికి ఆ పార్టీ టిక్కెట్ ఎలా కేటాయించిందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవు పలికారు. బీసీ సబ్ ప్లాన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. అసంబద్ధంగా మాట్లాడితే ప్రజలు ప్రశ్నిస్తారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదని అన్నారు. కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిడుతున్నారని అన్నారు. నేను కేసీఆర్‌కు మద్దతివ్వడం లేదని, మర్యాదపూర్వక వాతావరణం ఉండాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ఆవిర్భావానికి మంచి ముహూర్తం కోసం చూస్తున్నామని కవిత వెల్లడించారు. పార్టీ ఏర్పాటు ప్రక్రియ మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని అన్నారు.

## తెలంగాణ జనసేన నేతలతో పవన్ కల్యాణ్ భేటీ

అమరావతి: ఈ నెల 11న తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో పవన్ భేటీ అయ్యారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల గురించి వారితో చర్చించారు. ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, సాగర్ (ఆర్కే నాయుడు) తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో... ఇప్పటికే ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అత్యధిక స్థానాలు గెలుచుకుని సత్తా చాటాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పట్టుదలగా ఉన్నాయి. పోటీలో బీజేపీ కాస్త వెనుకబడినట్టు కనిపిస్తున్న తరుణంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక ప్రకటన చేశారు. తాను, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పవన్ కల్యాణ్ ను కలిశామని... మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఆయన పూర్తి మద్దతు తెలిపారని వెల్లడించారు.

### మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలనే

## ప్రధాన అజెండాగా మార్చాలి

మొదటి పేజి తరువాయి

ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు, తెలంగాణ ప్రజలకు ఆయన ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాల అమలు వంటి మౌలిక వసతులపై చర్చ జరగాల్సి ఉండగా, సీఎం రేవంత్ తన 'బూతు పురాణం'తో చర్చను నీరుగారుస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్‌పై చేస్తున్న దాడిని తెలంగాణ పోరాట చరిత్రపై జరుగుతున్న దాడిగా అభివర్ణించారు. "పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన శిల్పి కేసీఆర్. ఆయన ఏనాడూ బిరుదుల కోసం పాకులాడలేదు. ప్రజల సంక్షేమమే ఆయనకు అసలైన సత్కారం" అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని, ఈ నమ్మకద్రోహంపైనే మన పోరాటం ఉండాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. "ఎరువుల కోసం క్యూలైన్లలో నిలబడిన రైతుల కష్టాలు, రైతు భరోసా అందక వడ్డీ వ్యాపారుల చేతిలో నలిగిపోతున్న అన్నదాతల ఆవేదనపై ప్రభుత్వాన్ని నిలదీయండి. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు, గురుకులాల్లో విషాహారంతో చిన్నారులు పడుతున్న బాధలకు బాధ్యులెవరని గల్లా పట్టి అడగండి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు. డీఏలు, పీఆర్సీ ఊసే లేక ఉద్యోగులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక వృద్ధులు పడుతున్న మనోవేదనకు బీఆర్ఎస్ గొంతుకగా నిలవాలని ఆయన సూచించారు. సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ప్రజలకు వివరించాలని కోరారు. తెలంగాణ నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి ఒక 'కోవర్టు'లా వ్యవహరిస్తూ తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కేటీఆర్ తన లేఖలో కోరారు. ఇది తెలంగాణకు పట్టిన గ్రహణ కాలమని, ఈ చీకటిని తరిమికొట్టే బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

## మనకెందుకులే అనుకోవద్దు... ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది

మొదటి పేజి తరువాయి

భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

## తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం రద్దయింది. ఇంతకు ముందు వెలువడిన ప్రకారం రేపు, ఎల్లుండి ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. తాజాగా ఆయన ఎన్నికల ప్రచారం రద్దయినట్టు జనసేన ప్రకటించింది. ఏపీలో రాజకీయ పరిణామాలు, పవన్ వ్యక్తిగత కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం. మరోవైపు, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో ఈ ఉదయం పవన్ భేటీ అయిన సంగతి తెలిసిందే. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల గురించి వారితో పవన్ చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, సాగర్ (ఆర్కే నాయుడు) తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్

హైదరాబాద్: సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు ఈ ప్రభుత్వం రూ.1 కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. బాధిత కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ మాత్రమే రూ.25 లక్షల చొప్పున ఇచ్చిందని అన్నారు. సిగాచీ కంపెనీలో 54 మంది ప్రాణాలు కోల్పోతే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇస్తామని చెప్పి రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. హామీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి పురుషుల బస్సు ఛార్జీలను రెండింతలు చేశారని ఆరోపించారు. రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, తాను మంత్రిగా వస్తానని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ డబ్బులు పంపిణీ చేస్తే తీసుకోవాలని, ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డివి వట్టి మాటలేనని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేదల వ్యతిరేక పార్టీ అని ధ్వజమెత్తారు.

## ప్రధాని ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటీ లేదు

ఢిల్లీ: రాహుల్ గాంధీలో, కాంగ్రెస్ పార్టీలో సిక్కుమతంపై ద్వేషం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రధాని ప్రసంగం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. గురువారం ప్రధాని మోదీ రాజ్యసభలో చేసిన ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటి కూడా లేదని విమర్శించారు. మోదీ 97 నిమిషాల పాటు ప్రసంగించారని కానీ ఏమాత్రం ఉపయోగం లేని ప్రసంగం అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం విషయంలో తాము చేసిన ప్రతిపాదనల్లో ఒక్క దానికి కూడా ఆయన స్పందించలేదని అన్నారు. ఆయన కేవలం 100 సంవత్సరాలు, 75 సంవత్సరాలు, 50 సంవత్సరాలు అంటూ ఏదేదో మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ నరవణే రాసిన పుస్తకాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించగానే అధికార పార్టీ ఇబ్బంది పడిందని అన్నారు. సభలో అధికార పక్షం తమకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదని అన్నారు. లోక్ సభ, రాజ్యసభ ప్రజాస్వామ్యానికి రెండు స్థంభాలని, ఒక దానిలో ప్రతిపక్షాన్ని అణిచివేసి మరో సభలో మాట్లాడితే ఫలితం లేదని ఖర్గే అన్నారు.

### అబద్ధాన్ని సృష్టించి..

## దానికి రెక్కలు కట్టి మరీ దుష్ప్రచారం చేశారు

విజయవాడ: వరుసగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ గూండాలు చేస్తున్న దాడులను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు.అక్కడ(గుంటూరులో) అంబటి రాంబాబు ఇంట్లోకి చొరబడి విధ్వంసం.. ఇక్కడ జోగి రమేష్( విజయవాడ, ఇబ్రహీంపట్నం) ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాటిళ్లతో దాడులు చేయడం కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు నిదర్శనమంటూ మండిపడ్డారు వైఎస్ జగన్. (శుక్రవారం, ఫిబ్రవరి 06) జోగి రమేష్ ఇంట్లో దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన వైఎస్ జగన్.. ఆపై కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం,వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'అంబటి రాంబాబు ఇంట్లో కొనసాగించిన జంగిల్ రాజ్ పరంపరను జోగి రమేష్ విషయంలో కూడా కొనసాగించారని ధ్వజమెత్తారు. ' గుంటూరులో అంబటి రాంబాబు అన్న ఇంటిని..ఇక్కడ జోగి రమేష్ ఇంటిని ధ్వంసం చేశారు. అంబటి రాంబాబు ఇంట్లోకి చొరబడ్డారు.. విధ్వంసం సృష్టించారు. అంబటి కుటుంబ సభ్యులపై దుర్భాషలాడారు. పక్కనున్న అంబటి ఆఫీస్‌ను కూడా తగలబెట్టారు. అంబటి ఇంట్లో, ఆఫీస్‌లో జరిగిన జంగిల్ రాజ్‌ను.. జోగి రమేష్ విషయంలో కూడా కొనసాగించారు.

### రెక్కలు కట్టి మరీ దుష్ప్రచారం...

చంద్రబాబు అబద్ధాలను సీబీఐయే తేటతెల్లం చేసింది. తిరుమల లడ్డూలో ఎటువంటి కల్తీ జరగలేదని సీబీఐ స్పష్టం చేసింది. జంతువుల కొవ్వు కానీ, గొడ్డు మాంసం కానీ ఎటువంటి పంది కొవ్వు కలపలేదని సీబీఐ రిపోర్ట్‌లో పేర్కొంది. శ్రీ వెంకటేశ్వరస్వామిని అగౌరపరిచిన, అవమానపరిచిన వ్యక్తి చంద్రబాబు. ఒక అబద్ధాన్ని సృష్టించి.. దానికి రెక్కలు కట్టి మరీ దుష్ప్రచారం చేశారు. లడ్డూలో జంతువుల కొవ్వు అంటూ విష ప్రచారం చేశారు. చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు ఆడుతున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా, చంద్రబాబు హయాంలో సేకరించిన నమూనాలను కేంద్ర సంస్థలైన ఎన్డీడీబీకి, ఎన్డీఆర్ఐకి పంపింది. ఎలాంటి కల్తీ జరగలేదని చెప్పాయి. సీబీఐ ఇంకొకటి కూడా చెప్పింది. టీటీడీ ఛైర్మన్‌లుగా పని చేసిన తమ నేతలు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలు సమయంలో ఎటువంటి తప్పు జరగలేదని సీబీఐ క్లీన్‌చిట్ కూడా ఇచ్చింది. సీబీఐ ఇచ్చిన చార్జ్‌షీట్‌లో.. పేజ్ నం 62లో వాళ్లు మెన్షన్ చేసింది ఏమిటంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా జూలైలో టీటీడీ వాళ్లు నాలుగు ట్యాంకర్లు రిజెక్ట్ చేశారు. అవే ట్యాంకర్లను దొడ్డిదారిని మళ్లీ టీటీడీకి రప్పించి, వాటినే వాడారని సీబీఐ చెప్పింది. మరి ఇప్పుడు పాపం చేసింది ఎవరు అనేది ప్రశ్నిస్తున్న చంద్రబాబుని. కూటమి నేతల్ని కూడా ప్రశ్నిస్తున్న తప్పు ఎవరు చేశారు? పాపం ఎవరు చేశారు? అని, జంతువుల కొవ్వు ఉందగని, గడ్డు మాంసం ఉందని ఏ ల్యాబ్ రిపోర్ట్‌లు చెప్పాయి. ఎవరూ చెప్పలేదు.

## ఘనంగా రామబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు



కమ్మర్పల్లి మండల ఫిబ్రవరి 07 హంస కలం వార్త: నిజామాబాద్‌జిల్లా బాల్కొండ నియోజకవర్గం లో మండల కేంద్రమైనఏర్గట్ల గ్రామంలో గల మండల అంబేద్కర్ యువజన సంఘం, బహుజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో డా. బీ. ఆర్. అంబేద్కర్ సతీమణి రామబాయి జయంతి వేడుకలను శనివారం రోజున ఘనంగా నిర్వహించారు. ముందుగా రామబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించి రామ బాయి అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు, బహుజన యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ, రామబాయి తాను కష్ట పడి అంబేద్కర్ ను విదేశాల్లో చదివించిందని, అంబేద్కర్ చదువు కోసం తన పిల్లల ఆరోగ్యం బాగులేకున్నా పట్టించుకోలేదని, ఆ డబ్బులతో అంబేద్కర్ చదువుకొని రాజ్యాంగం రాసారని, దీనితో భారత దేశం లో బడుగు బలహీన వర్గాల వారే కాకుండా, ప్రతి ఒక్కరు చదువుకొని స్వేచ్ఛ గా ఉంటున్నారని వారు అన్నారు. రామబాయి తన పిల్లల కోసం గాకుండా దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహా గొప్ప మనుషు ఉన్నా మనిషి అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు చిట్యాల రాజు, బహుజన నాయకులు రాజేష్,రక్షక్, ముత్తేన్న, స్వాతి అనిల్, శేఖర్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్, వడ్ల సరేష్, గంగాధర్, శోభన్, న్యాత రవి,రాజేశ్వర్, పౌలింగ్,తదితరులు, పాల్గొన్నారు.

## కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారం జోరు



తల్లాడ మండలం ఫిబ్రవరి 07 హంస కలం వార్త: కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఊపందుకుంది. 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలనే లక్ష్యంతో ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు దూసుకుపోతున్నారు. 7వ వార్డులో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా తిరుగుతూ ఓటర్లను కలిసి, పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాహిత కార్యక్రమాలు వివరించారు. ఈ ప్రచారంలో వైరా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, తల్లాడ మండల సీనియర్ నాయకులు పొట్టేటి జనార్ధన్ రెడ్డి, యుగేందర్, పగడాల లక్ష్మిరెడ్డి, విస్సనపల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూ, ప్రజల మద్దతు కోరారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలతో వాతావరణాన్ని ఉత్సాహంగా మార్చారు. జై కాంగ్రెస్ నినాదాలతో ప్రచారం హోరెత్తింది.

## గద్వాల జిల్లా మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ ను సన్మానించిన గద్వాల్ ఎమ్మెల్యే గారు, జిల్లా డిసిసి అధ్యక్షుడు గారు



ఫిబ్రవరి 07 హంస కలం వార్త: గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు, మున్సిపాలిటీ ఎన్నికల భాగంగా గద్వాల జిల్లా కు ఎన్నికల ఇన్చార్జి గా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ గారిని, నియమించడం జరిగింది విచ్చేసిన సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు, జిల్లా డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి గారు,శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర వినియోగదారుల ఫోరం కన్వీనర్ ఛైర్మన్ గట్టు తిమ్మప్ప గట్టు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ గిరిజన నాయకులు వివిధ తాండ సర్పంచ్లు వెంకటేష్ నాయక్ పాండు నాయక్ గోపాల్ నాయక్ మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సురేష్ నాయక్ సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ఎం రవి నాయక్ సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షులు రవి నాయక్.శీను నాయక్ సేవాలాల్ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ నాయక్ మాజీ సర్పంచ్ వీరేష్ నాయక్ ఉప సర్పంచ్ మున్నా నాయక్ బీమా నాయక్ గోపాల్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న,ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ,డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ గారు.



ఫిబ్రవరి 07 హంస కలం వార్త: జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ,ఈరోజు ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ గారు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పార్వతమ్మ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. తుపత్రాల ప్రాంత అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి గారు కోటి రూపాయలను కేటాయించడం జరిగిందని వాటిలో సీసీ రోడ్లు వీధి దీపాలు డ్రైనేజీలు మరియు పాఠశాల అభివృద్ధి లాంటి అనేక అంశాలు పొందు పరిచారని సంపత్ కుమార్ గారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల మాత్రమే అభివృధి సాధ్యం కనుక చేతి గుర్తు పైన ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బారి మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఓటర్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మిడ్జిల్ మండల బి ఆర్ ఎస్ కార్యకర్తలను పరామర్శించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



ఫిబ్రవరి 07 హంస కలం వార్త: మిడ్జిల్ మండల దోనూర్ గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకుడు సుధ మల్లయ్య అమ్మగారి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబానికి మనోధర్యం తెలియజేయడం జరిగింది. అనంతరం అదే గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం మృతి చెందిన ఎర్రగోలు వెంకటయ్య అమ్మ కాలే లింగం తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకుడు నరేష్ గౌడ్ తమ్ముడు మంగలి ఆంజనేయులు. కూతురికి కొద్ది రోజుల క్రితం బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లాపూర్ గ్రామంలో పట్నం నారాయణ అనారోగ్యంతో ఆకస్మితంగా మృతి చెందడం జరిగింది కుటుంబ సభ్యులకు పరామర్శించి సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో. మాజీ జెడ్పిటిసి శశిరేఖ బాలు. మాజీ ఎంపీపీ సుదర్శన్. మండల అధ్యక్షుడు జెమిని పాండు. మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి. సోషల్ మీడియా అధ్యక్షుడు భీమ్ రాజ్. బి ఆర్ ఎస్ మొన్న ఎన్నుకోబడిన సర్పంచులు. నాయకులు పాల్గొన్నారు

## మహబూబ్నగర్ మున్సిపల్ అభ్యర్థి రాజేందర్ రెడ్డి కి మద్దతు పలికి ప్రచారం చేసిన మిడ్జిల్ మండల కాంగ్రెస్ నాయకులు సర్పంచులు



ఫిబ్రవరి 07 హంస కలం వార్త: మహబూబ్నగర్ మున్సిపాలిటీలో పోటీకి నిలబడిన కాంగ్రెస్ అభ్యర్థి 21 వార్డు కాంగ్రెస్ యువనేత రాజేందర్ రెడ్డి కి మద్దతు పలికి తన వెంట ఉండి ఇంటింటికి ప్రచారం చేసుకుంటూ ఈ ప్రభుత్వం చేసే అభివృద్ధి పథకాలను చెప్పి రాజేందర్ రెడ్డి కి ఓటు వేయాలని మిడ్జిల్ మండల కాంగ్రెస్ నాయకులు. సర్పంచులు ప్రచారం ఉత్సాహంగా చేసుకుంటూ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న. రాణిపేట్ సర్పంచ్ మాధవి మల్లేష్. మున్ననూర్ సర్పంచ్ సుజాత మల్లికార్జున్. వేముల మాజీ ఎంపీటీసీ చెన్నయ్య. మిడ్జిల్ మండల కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలుపుతూ ఇందులో పాల్గొన్నారు

# ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం

మున్సిపల్ ఎన్నికల్లో బి.ఆర్.ఎస్. అభ్యర్థులను గెలిపించండి...

కారు గుర్తుపై ఓటేసి భీమ్‌గల్ భవిష్యత్తును కాపాడండి...

బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడి...





భీమ్గల్ మండలఫిబ్రవరి 07 హంస కలం వార్త:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 3, 5, 6, వార్డులలో టిఆర్ఎస్ ( బి.ఆర్.ఎస్) పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భీమ్‌గల్‌ను గ్రామ స్థాయి నుంచి మున్సిపాలిటీగా మార్చడమే కాకుండా సుమారు 200 కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. గత 10 ఏళ్లలో జరిగిన అభివృద్ధి వల్ల భీమ్‌గల్‌లో భూముల మార్కెట్ విలువ పెరిగింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. భీమ్‌గల్‌లో మిగిలిపోయిన అదనపు పనుల కోసం తాను 10 కోట్ల రూపాయలు మంజూరు చేశానని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్షపూరితంగా ఆ పనులను రెండేళ్లుగా నిలిపివేసిందని ఆరోపించారు. పనులు ప్రారంభించకుండా ప్రజలను ఇబ్బంది పెట్టి, ఎన్నికలు రాగానే శంకుస్థాపనల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం లింబాద్రి గుట్టకు వెళ్లే రోడ్డును సెంట్రల్ లైటింగ్, డివైడర్‌తో పాటు 4 లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు గిరి ప్రదక్షిణ రోడ్డును కూడా పూర్తిచేశామని గుర్తు చేశారు. అలాగే నిజామాబాద్, ఆర్మూర్ వెళ్లాల్సిన అవసరం లేకుండా భీమ్‌గల్‌లోనే వైద్యం అందాలనే ఉద్దేశంతో 40 కోట్ల రూపాయలతో 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేసి 80 శాతం పనులు పూర్తి చేశామని, అయినా మిగిలిన పనులు చేయకుండా ఆసుపత్రిని ప్రారంభించకపోవడం దురదృష్టకరమన్నారు. 6 కోట్లతో ప్రారంభించిన మార్కెట్ పనులు, భీమ్‌గల్ బస్ డిపోను కూడా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. బస్ డిపోలో బస్సులు లేవని, కంట్రోలర్లు కూడా లేరని అక్కడ బర్లు పడుకుంటున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి 25 నెలలైనా ఒక్క రూపాయి ఇవ్వలేదని, అంటే ఒక్కో మహిళకు రూ.62,500 బాకీ పడిందని వ్యాఖ్యానించారు. అవ్వాతాతలకు 4000 రూపాయల పింఛన్ ఇవ్వక గత 25 నెలల్లో 50 వేలు బాకీ పడింది అన్నారు. తులం బంగారం, రైతు రుణమాఫీ, రైతుబంధు హామీలు అన్నీ మాటలకే పరిమితమయ్యాయని తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే తీర్పు రావాలని, బి ఆర్ ఎస్, అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రభుత్వం భయపడి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అన్నారు. బీజేపీకి ఓటు వేసి ఓటును వృథా చేసుకోవద్దని కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్రానికి అధిక పన్నులు వెళ్తున్నా, కేంద్రం మాత్రం నిధులు కేటాయించడంలేదని, రాష్ట్రం నుండి 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని విమర్శించారు. బి.ఆర్.ఎస్. పార్టీ అభ్యర్థులు ప్రజలతో కలిసి ఉంటారని, సమస్య వచ్చిన వెంటనే ప్రజల పక్షాన నిలబడతారని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకుని భీమ్‌గల్ భవిష్యత్తు కోసం కారు గుర్తుపై ఓటేసి టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బోదిరే లావణ్య నర్సయ్య, నీలం లావణ్య గంగాధర్, మూత లింబాద్రిలను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన నిలబడి భీమ్‌గల్ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతానని మా అభ్యర్థులను గెలిపించండి మిగిలిపోయిన పనులన్నింటిని దగ్గరుండి పూర్తి చేయిస్తామని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి పథకాల తో కాంగ్రెస్ గాలి వీస్తుంది

రాష్ట్రంలో మున్సిపల్, పురపాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకుంటుంది...

రాష్ట్ర మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి వెల్లడి...



భీమ్గల్ మండల ఫిబ్రవరి 07 హంస కలం వార్త: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తరువాత రెండేళ్ల పాలన లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను, గతంలో దేశవ్యాప్తంగా ఏ ప్రభుత్వం చేపట్టలేదని, భారత దేశంలోనే తెలంగాణలో కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్రమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పర్యటనలో భాగంగా శనివారం రోజున రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, భీంగల్ పట్టణంలో గల సహస్ర ఫంక్షనాల్లో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న నియోజకవర్గస్థాయి తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల తో ప్రత్యేకంగా బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఏర్పాటు చేసిన సభ సమావేశంలో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించానని, అన్ని జిల్లాల్లో గల పురపాలక, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్కు భారీ మెజార్టీతో పట్టంకట్టి, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ ఎన్నికల్లో, పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని రాష్ట్రమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూసి ప్రజలు కాంగ్రెస్ వైపే ముగ్గు చూపడమే కాకుండా ఆదరిస్తున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు చిత్తుచిత్తుగా ఓడిపోతాయని మంత్రి తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత, బిజెపి, టిఆర్ఎస్, ఎంఐఎం, పార్టీలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, స్థలాలు, ఇల్లా నిర్మాణాలకు రుణాలు, సన్నం బియ్యం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, రైతులకు బోనస్, రైతు భరోసా, సిలిండర్ లకు 500 రూపాయలు బోనస్, ఉచిత బస్సు ప్రయాణం, అంతేకాకుండా పలు మరిన్ని పథకాలను అమలు చేసి అందించడం వల్లే, రెండేళ్లలోనే ఎంతో అభివృద్ధి చేయడం వల్ల ప్రజలు కాంగ్రెస్ను ఆదరిస్తూ, కాంగ్రెస్ వైపే ముగ్గు చూపడం, మున్సిపల్, పురపాలక సంఘాల ఎన్నికల్లో కాంగ్రెస్ నే గెలిపించాలన్న పట్టుదల ప్రజల్లో కలిగిందని ఆయన అన్నారు. మరో రెండేళ్లలో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి, మరింత అభివృద్ధి చేసి మళ్లీ వచ్చి అసెంబ్లీ ఎన్నికల్లోను ప్రజలు కాంగ్రెస్ సంక్షేమ అభివృద్ధి పథకాలను ఆదరించి మరోసారి పట్టం కడతారని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. మున్సిపల్, పురపాలక ఎన్నికల్లో అన్ని పార్టీలు క్లీన్ స్వీప్ అవుతాయని రాష్ట్రమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, టీఎంజీ రాష్ట్ర చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, అన్వేష్ రెడ్డి, తాజా మాజీ డిసిసిబి జిల్లా చైర్మన్ రమేష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గం స్థాయి తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 16వ వార్డులో దామల రాజుకు భారీ మెజారిటీ ఖరారు




ఫిబ్రవరి 07 హంస కలం వార్త: కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ సందర్భంగా నీరజ మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ, కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక మెజారిటీతో గెలవడం ఖాయమని స్పష్టం చేశారు.

16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన శ్రీ దామల రాజు గెలుపు తప్పనిసరి అని తెలిపారు. ప్రజలంతా కాంగ్రెస్ సంక్షేమ పాలనను విశ్వసిస్తున్నారని, అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత
ఇందిరమ్మ ఇళ్ల పథకం,
పింఛన్ల పెంపు,
రేషన్ కార్డుల మంజూరు,
ఉచిత విద్యా--వైద్య సదుపాయాలు,
పేదలు, రైతులు, మహిళలకు అనేక సంక్షేమ పథకాలు

అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని సంపాదించిందని పేర్కొన్నారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పూర్తి మద్దతు ఇస్తున్నారని అన్నారు.

16వ వార్డు ఓటర్లు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు "హస్తం" గుర్తుపై ఓటు వేసి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని నీరజ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరారు. కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికలకు ఫిబ్రవరి 11, 2026 (బుధవారం) ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

## చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డు ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓట్లు అభ్యర్థించిన పాక చిరంజీవి

చెరుకు లింగస్వామి గౌడ్ 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



యాదాద్రి భువనగిరి జిల్లా స్టాపర్ ఫిబ్రవరి 07 హంస కలం వార్త: కాంగ్రెస్ పార్టీ 12వ వార్డు అభ్యర్థి పాక చిరంజీవి ప్రచార ర్యాలీలో వార్డ్ అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో వార్డ్ మొత్తం పార్టీ సీనియర్ నాయకులతో మహిళలతో ర్యాలీ తీసి ఓటు అభ్యర్థించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా 12వ వార్డ్ అభ్యర్థి పక్క చిరంజీవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలు ప్రతి గడపగడపకు చేరవేయడం జరిగింది ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన నాకు ఓటు వేసి ఆత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు అన్నారు అని అన్నారు. 12 వార్డు భూత అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలే తమ అభ్యర్థులను గెలిపిస్తాయని కొనుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహాయ సహకారంతో వాడును అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో సీతా రామచంద్రస్వామి దేవాలయం గుడి కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, కంచర కుంట్ల వెంకట్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ బుంగపట్ల భారతమ్మ ,మాజీ కౌన్సిలర్ సుల్తాన్ రాజు, వార్డ్ ఇన్చార్జిలు మాధవన్ శేఖర్ గౌడ్, బక్క శ్రీనాథ్, తీగుళ్ల బాలరాజు , పార్టీ సీనియర్ నాయకులు తమ్మ కొండ రాజు, మాస సుధాకర్ , మానుపాటి వెంకటేశ్వర్ , బొమ్మ కంట శివ, సుల్తాన్ శేఖర్, జాజుల శివ, అల్లి కృష్ణ , సాయి, కంచరకుంట్ల శశిధర్ రెడ్డి, తేలుకుంట్ల నవీన్, మహిళా నాయకురాలు బొబ్బిలా సంధ్య, రెడ్డి లక్ష్మి, చిందం జ్యోతి ,జిట్టం ,కవిత, కౌసల్య బుడ్డా దివ్య తదితరులు నాయకులు, కార్యకర్తలు

## ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పట్టం కట్టండి

బత్తుల వాణి విప్లవ గౌడ్ 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి



యాదాద్రి భువనగిరి జిల్లా స్టాపర్ ఫిబ్రవరి 07 హంస కలం వార్త: తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి కి పట్టం కట్టిన రేవంత్ ప్రభుత్వం చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకొని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహాయ సహకారాలతో 13 వ వార్డ్ అభివృద్ధి చేస్తానని బత్తుల వాణి విప్లవ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పథకం, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుబంధు పథకం, రేషన్ కార్డుల పంపిణీ, లాంటి కార్యక్రమాలు తెలంగాణ ప్రజలు అందరికీ రాజకీయా లకతీతంగా, వర్గాలకతీతంగా ప్రతి వ్యక్తికి చేరేటట్లుగా ప్రభుత్వం పని చేస్తున్నదని, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం కేవలం తమ పార్టీ వారికే పని చేసిందని, దాదాపు పది సంవత్సరాలపాటు అరాచక అవినీతి, దోపిడీకి తెలంగాణ గురైందని, మళ్లీ అలాంటి పొరపాట్లు చేయకుండా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. 13వ వార్డులో ప్రధాన సమస్యలన్నీ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహాయ సహకారాలతో వార్డు సమస్యలన్నీ పరిష్కరిస్తానని అన్నారు




## సమ్మర్ 2026పై మెగా ముద్ర

సంక్రాంతి 2026 సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్నారు. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఏకంగా రూ.375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి టాలీవుడ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. సంక్రాంతి సీజన్ ముగియడంతో ఇప్పుడు సినీ ప్రేక్షకుల దృష్టంతా సమ్మర్ సీజన్‌పై పడింది. ఈ నేపథ్యంలో పెద్ద సినిమాలన్నీ వరుసగా వేసవి విడుదలలకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం పరిస్థితులు గమనిస్తే సమ్మర్ 2026పై మెగా ఫ్యామిలీ డామినేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఐదు సినిమాలు మెగా కుటుంబం నుంచి విడుదలకు రెడీ అవ్వడం విశేషం. అందులో మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ వంటి టాప్ హీరోల సినిమాలు కూడా ఉండటంతో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సమ్మర్ సీజన్‌కు శ్రీకారం చుట్టేది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అనే చెప్పాలి. పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ తరువాత మెగా డాటర్ నిహారిక నిర్మాతగా ఉన్న 'రాకాస' చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ ఫాంటసీహారర్ కామెడీ జానర్‌లో రాబోతోంది. తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సమయం మొదలవుతుంది. ఆయన హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా మంచి హైప్ ఉంది. భారీ బడ్జెట్, భారీ అంచనాలతో ఈ చిత్రం సమ్మర్ హైలైట్‌గా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇక మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మరో ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వంభర'. దర్శకుడు వశిష్ట రూపొందిస్తున్న ఈ పాన్ ఇండియా ఫాంటసీ డ్రామా భారీ గ్రాఫిక్స్‌తో జూలైలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. విజువల్ వండర్‌గా నిలిచే అవకాశమున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' కూడా సమ్మర్ బరిలోకి దిగుతోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. వినోదాత్మక అంశాలతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.ఇలా ఒకే సమ్మర్ సీజన్‌లో మెగా ఫ్యామిలీ నుంచి వరుసగా ఐదు సినిమాలు విడుదల కావడం టాలీవుడ్‌లో అరుదైన విషయంగా మారింది. బాక్సాఫీస్ వద్ద ఈ మెగా సినిమాలు ఎలాంటి ఫలితాలు సాధిస్తాయో, ప్రేక్షకులు ఏ చిత్రానికి ఎక్కువ ఆదరణ చూపిస్తారో అనేది ఆసక్తికరంగా మారింది. ఈ వేసవి నిజంగా "మెగా సమ్మర్"గా నిలిచే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో?

అల్లు అర్జున్ - రష్మికలది వెండితెరపై హిట్ జోడీ. ఈ ఇద్దరూ విజయవంతమైన 'పుష్ప' సిరీస్ సినిమాలతో అందర్నీ మెప్పించారు. వీళ్లిద్దరూ ఇప్పుడు మరోసారి కలిసి తెర పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ బహుభాషా చిత్రం సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రష్మిక ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడా పాత్ర చిత్రీకరణ కోసం ఆమె సెట్స్‌లోకి అడుగు పెట్టిందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో రష్మికది ప్రతినాయిక ఛాయలున్న పాత్రగా ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో ఆమెతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇది సైన్స్ ఫిక్షన్ అంశాలతో నిండిన ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. అల్లు అర్జున్ ఇందులో రెండు భిన్నమైన పాత్రల్లో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. దీపికా పదుకొణె కథానాయిక. మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్లు ప్రచారం వినిపిస్తున్నా.. ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.



## చరణ్ కోసం వెనక్కి తగ్గిన 'లెనిన్'

అక్కినేని అఖిల్ తన కెరీర్‌లో ఎలాగైనా భారీ హిట్ కొట్టాలనే పట్టుదలతో 'లెనిన్' చిత్రంపై గంపెడు ఆశలు పెట్టుకున్నాడు. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ మాస్ యాక్షన్ డ్రామా కోసం అఖిల్ తన లుక్ నుంచి డైలాగ్ డెలివరీ వరకు చాలా మార్పులు చేసుకున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన రావడంతో మే 1, 2026న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించింది. అయితే ఏప్రిల్ 30న రామ్ చరణ్ పాన్-ఇండియా చిత్రం 'పెద్ది'(జూవటటతి)వస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో 'లెనిన్' విడుదల తేదీ డైలమాలో పడింది. చరణ్ వంటి స్టార్ హీరో సినిమాకు కేవలం ఒక్కరోజు గ్యాప్‌లో రావడం బాక్సాఫీస్ వద్ద వసూళ్లపై, థియేటర్ల దొరకడంపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిర్మాతలు ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'లెనిన్' మేకర్స్ తమ సినిమాను వాయిదా వేసే దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. 'పెద్ది' చిత్రానికి ఉన్న భారీ హైప్ దృష్ట్యా, అఖిల్ సినిమాకు సోలో రిలీజ్ దొరికితేనే అది బాక్సాఫీస్ వద్ద నిలబడగలదని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ భావిస్తున్నాయట. అందుకే వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు టాక్. రామ్ చరణ్, అఖిల్ మధ్య మంచి స్నేహబంధం ఉంది. ఇప్పటికే ఈ క్లాష్‌పై ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'లెనిన్'ను మే మూడవ వారానికి లేదా జూన్ ఆరంభానికి వాయిదా వేసే అవకాశం ఉందని తెలుస్తోంది.



## తారక్‌లా ఇండస్ట్రీలో ఎవరూ ఉండరు.. జూనియర్ ఎన్టీఆర్‌పై ప్రశంసలు

ప్రముఖ బాలీవుడ్ నటి పూజా బేడీ చాలా తక్కువ సినిమాలే చేసింది. వాటిలో చిట్టెమ్మ మొగుడు (1993), శక్తి (2011) అని రెండు తెలుగు సినిమాలు కూడా ఉన్నాయి. అయితే చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు తెరపై సందడి చేసింది. చంద్రహాస్ హీరోగా నటించిన బరాబర్ ప్రేమిస్తా మూవీలో పూజా బేడీ కీలక పాత్రలో నటించింది. ఇటీవల ఈ సినిమా ఈవెంట్‌లో ఎన్టీఆర్‌పై ప్రశంసలు కురిపించింది పూజా బేడీ.

**నెగెటివ్ పాత్ర**

ఆమె మాట్లాడుతూ.. శక్తి సినిమా నేను సోనూసూద్‌కు భార్యగా నటించాను. నాది ప్రతికూల ఛాయలున్న పాత్ర. ఓ సీన్‌లో హీరో నాతో ఫైట్ చేయాల్సి ఉంటుంది. అందుకు జూనియర్ ఎన్టీఆర్ ఒప్పుకోలేదు. ఆడవారితో ఫైట్ చేయలేనని నిరాకరించారు. అప్పుడు ఆయనపై గౌరవం మరింత పెరిగింది. ఇప్పుడున్న సినీప్రపంచంలో ఇలాంటి విలువలు పాటించేవాళ్లు చాలా అరుదు అని తెలిపింది.

**తారక్ సినిమా**

జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే ఆయన చివరగా వార్ 2లో కనిపించాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ పాన్ ఇండియా మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం తారక్.. ప్రశాంత్ నీల్‌తో డ్రాగన్ మూవీ చేస్తున్నాడు. అలాగే దేవర 2 సినిమా కూడా లైన్‌లో ఉంది.






## అదే నా అసలైన విజయం

బాలీవుడ్ యంగ్ బ్యూటీ శనయా కపూర్ కెరీర్ ప్రయాణంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తన తొలి చిత్రం 'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్' ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనప్పటికీ, ఆమె మాత్రం ఆ అనుభవాన్ని ఒక మధుర జ్ఞాపకంగా భావిస్తోంది.రివ్యూలు, ఫలితాలతో సంబంధం లేకుండా, తనను తాను మొదటిసారి వెండితెరపై చూసుకోవడం ఒక నటిగా తన జీవితంలోనే అది అతిపెద్ద విజయం అని.. ఆ క్షణాన్ని తాను పూర్తిగా ఆస్వాదించానని ఆమె స్పష్టం చేసింది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శనయా.. "థియేటర్ నిండా ప్రేక్షకులు ఉండాలని, అందరి ప్రేమను పొందాలని ఏ నటికైనా ఉంటుంది. కానీ నా మొదటి సినిమా విషయంలో అది పూర్తిగా జరగకపోయినా నేను కృంగిపోలేదు. వెండితెరపై నన్ను నేను మొదటిసారి చూసుకోవడమే నా అసలైన విజయంగా భావించాను. ఎందుకంటే ఆ సినిమా రిలీజ్ కోసం నేను చాలా కాలం వెయిట్ చేశాను. ఆ సమయంలో వచ్చిన ప్రేక్షకుల ఆదరణే నాకు గొప్ప ప్రేరణనిచ్చింది" అని తెలిపింది. సినిమా ఫలితం తనను మానసికంగా దెబ్బతీయలేదని, తన దృష్టంతా ఎప్పుడూ ముందడుగు వేయడం పైనే ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది. ఒక సినిమా ఫలితం తన స్క్రిప్ట్ ఎంపికలను మార్చలేదని.. కేవలం గుడ్డిగా వెళ్లకుండా, తన మనసుకు నచ్చిన కథలనే ఎంచుకుంటానని ఆమె పేర్కొంది. నా తదుపరి చిత్రం 'తూ యా మైన్' పనుల్లో బిజీగా ఉన్నాను. పనిలో నిమగ్నమవ్వడమే అన్ని సమస్యలకు పరిష్కారం" అని శనయా చెప్పుకొచ్చింది. భవిష్యత్తులో తాను చేయబోయే సినిమాల గురించి చెబుతూ.. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కానని ఆమె పేర్కొంది. 'నేను రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. కొత్త జోనర్లను అన్వేషించాలనుకుంటున్నాను.

## గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైన 'రాకాస'

'కమిటీ కుర్రోళ్లు' సక్సెస్‌తో జాతీయ స్థాయిలో గుర్తింపును సంపాదించుకుని సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా అందరి దృష్టిని ఆకర్షించిన నిహారిక కొణిదెల..ఇప్పుడు మరో మూవీతో రాబోతున్నది. జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో నిర్మిస్తోన్న లేటెస్ట్ మూవీ 'రాకాస'. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో నటుడిగా మెప్పించిన సంగీత్ శోభన్ తొలిసారి సోలో హీరోగా ఇందులో నటిస్తున్నారు. మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజైన ఈ సినిమా గ్లింప్స్, టైటిల్ మోషన్ పోస్టర్‌కు ఆడియెన్స్ నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పుడు ఇదే జోష్‌తో తాజాగా ఈ చిత్రం రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. 'రాకాస' చిత్రం వరల్డ్ వైడ్‌గా ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా.. ఇందులో సంగీత్ చేతిలో కాగడా పట్టుకుని చీకటిలో దేన్నో వెతుకుతున్నాడు. ఇది మరింత క్యూరియాసిటీని పెంచుతోంది.

